# సినీమంత్రికుడు - బహుముఖ ప్రజ్ఞా శాలి సత్యజిత్ రాయ్

- విష్ణుభొట్ల లక్ష్మన్న

"కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు, మహా పురుషులవుతారు" అన్న వేటూరి సినీగీతం సత్యజిత్ రాయ్‌కి అచ్చంగా వర్తిస్తుంది. సినిమాలు ఇష్టం ఉన్న వారికి ప్రముఖ ప్రపంచ (బెంగాలి) సినిమా దర్శకుడు సత్యజిత్ రాయ్ గురించి తెలియకుండా ఉండదు. నా కాలేజీ రోజుల్లో రాయ్ సినిమాలు చాలా చూసాను కానీ వాటి గురించి ఎక్కువ పట్టించుకునే వాణ్ణి కాదు. ఈ మధ్య "ఈ మాట" వెబ్ పత్రికలో రాయ్ సినిమాల మీద (ఒక సినిమాపై ఒక వ్యాసం చొప్పున) సమీక్షలు, రాస్తూ, రాయ్ సినిమాలు మళ్ళీ మళ్ళి చూస్తున్నా. చిత్రమైన విషయం ఏమిటంటే రాయ్ సినిమాలపై తెలుగులో వచ్చిన సమీక్షలు, వ్యాసాలు తక్కువే! ప్రపంచ సినిమా రంగంలో గుర్తించబడ్డ తొలి భారతీయుడైన సత్యజిత్ రాయ్ సినిమాలను పరిచయం చేస్తూ తెలుగులో పుస్తకాలు కూడా ఉన్నట్టు లేదు. ఈ నేపథ్యంలో, ౧౯౫౫ సంవత్సరంలో "పథేర్ పాంచాలి" సినిమాతో సినిమారంగేట్రం చేసి, దాదాపు ౩౯ సినిమాలకి దర్శకత్వం వహించిన సత్యజిత్ రాయ్ సినిమాల మీద ఒక సంగ్రహ సమీక్ష రాసే ప్రయత్నమే ఈ వ్యాసం.

**పరిపూర్ణత్వం**

చాలా మంది చిత్రదర్శకులకి సినిమా తియ్యటంలో ఉన్న ఒకటి,రెండు అంశాలపై సాధికారత ఉంటుందేమో! సత్యజిత్ రాయ్ అలా కాదు. సినిమా నిర్మాణంలో ఉన్న - నటనా దర్శకత్వం, సిన్మాటోగ్రఫీ (కెమేరా పనితనం), ఎడిటింగ్, కథ, స్క్రీన్‌ప్లే, సంగీతం, కళా దర్శకత్వం, కాంతిని దానితో పాటు శబ్దాన్ని ఉపయోగించే తీరు - వంటి విభిన్న అంశాలలో నిష్ణాతుడు కావటంతో రాయ్ సినీప్రపంచంలో ఒక పరిపూర్ణతను సాధించాడనిపిస్తుంది. ఇంత బహుముఖత్వానికి బీజం - సినిమా మధ్యమాన్ని మథించాలి అన్న పట్టుదలే!

**కథా నిర్ణయం**

సినిమా విజయానికి ఒక మూలం "కథ" అనుకున్నట్టయితే దాన్ని వెండి తెరపై చూపించే కథనం కూడా ముఖ్యమైనదే! రాయ్ సినిమాలకి ఎన్నుకున్న కథలన్నీ మూసపోసినట్లు కాకుండా చాలా విభిన్నంగా ఉంటాయి. ఉదాహరణకి, భారతీయ చలనచిత్రాల్లో అంతకు ముందెన్నడూ లేనట్టు 'అపు చిత్రత్రయం' లో చూపించిన గ్రామీణ వాతావరణం, ఆ వాతావరణంలో పెరిగిన పిల్లల జీవిత చిత్రీకరణ వల్ల - భారతీయ సినిమాలో ఏకైక విజయంగా నిలిచిపోయాయి ఈ సినిమాలు. ఇలా ఒక పక్క గ్రామీణ జీవితాన్ని చూపించిన రాయ్ పట్టణ మధ్య తరగతి జీవితాన్ని చూపించిన సినిమాలు కూడా తీసాడు కాంచన జంగ, మహానగర్, నాయక్, అరణ్యేర్ దిన్ రాత్రి. అలాగే మరో విలక్షణ చిత్రత్రయం ఠాగోర్కి నివాళిగా తీసిన తీన్ కన్యా, చారులత, ఘరేభైరే. సంప్రదాయంపై తిరుగు బాటుగా తీసిన సినిమాలు - దేవి, సద్గతి కూడా చెప్పుకోతగ్గవే! అలాగే చరిత్రలో జరిగిన సంఘటనలపై చిత్రించిన పత్రంజి కా ఖిలారి, అశని సంకేత్ సినిమాలు గుర్తు పెట్టుకోతగ్గవి. చాలా మంది దర్శకులు విస్మరించిన చిన్న పిల్లలు ఇతివృత్తంగా ఉన్న సినిమాలు రాయ్ ఎన్నుకుని అమోఘమైన విజయాలని సాధించాడు. గోపీ గాయెనె-భాగా బయెనె, హిరక్ రాజా దేశె, సోనార్ కెల్లా, జై బాబు ఫేలూనాథ్, చిడియా ఖానా సినిమాలు ఈ కోవకు వస్తాయి. ఇవన్నీ ఇక్కడ ఉదాహరించడానికి కారణం రాయ్‌కి ఉన్న బహుముఖ ప్రతిభలోని ఒక కోణాన్ని మీ ముందుంచటమే!

**తూర్పు - పశ్చిమ దేశాల సినిమా ప్రభావం**

రాయ్ సినీ విజయాలకి ఒక కారణం రాయ్‌కి ప్రపంచ సినిమాతో ఉన్న గాఢమైన పరిచయం. ఒక పక్క అకిరా కురొసావా వంటి అతి ప్రతిభావంతుడైన జాపనీయ దర్శకుడు, మరో పక్క రెన్వార్ (ఫ్రెంచ్), బైసికిల్‌థీఫ్ సినిమా తీసిన విక్టోరియడెసికా (ఇటలియన్) వంటి దర్శకుల ప్రభవం రాయ్‌పై బలంగా ఉన్నాయి. సినిమా అన్న మాధ్యమం అర్థం చేసుకోటానికి ఇలాంటి పరిచయాలు ఎంతో ఉపయోగపడ్డాయని రాయ్ స్వయంగా చెప్పుకున్నాడు.ఎంతో మంది దర్శకులకి లేని మరొక ప్రతిభ రాయ్‌కి ఉన్న జర్నలిజం అనుభవం. సినిమాల్లోకి రాక ముందు రాయ్ జర్నలిస్టుగా ౧౩ ఏళ్ళు పని చేసాడు. ప్రపంచ సినిమాలపై తన అనుభవాలు "మన సినిమాలు, వాళ్ళ సినిమాలు" అన్న పుస్తకంలో వివరంగా రాస్తాడు. అందువల్ల, రాయ్ ద్వారా సినిమా అన్న మాధ్యం గురించి ఎన్నో వివరాలు తెలుస్తాయి.

1940 దశాబ్దంలో శాంతినికేతన్‌లో లలిత కళలు, గ్రాఫిక్ డిజైనింగ్ అభ్యసించి బయటికి వచ్చిన రాయ్‌ని సినిమాలు ఎంతో ఆకర్షించాయి. కానీ, భారతీయ సినిమాల్లో ఎంతసేపూ తీపి వలపుల ప్రేమ పాటలు, మార్మిక పురాణగాథలు రాజ్యమేలటం రాయ్‌ను చికాకు పెట్టాయి. "సినిమాకు జీవితమే ముడిసరుకు కావాలి. సినిమా వంటి జనమధ్యమానికి స్ఫూర్తి మన జీవితంలో, మన మూలల్లో ఉండాలి. సంగీతం,కవిత్వం, చిత్రలేఖనం వంటి రంగల్లో ఎంతో మందికి స్ఫూర్తినిచ్చిన మన దేశం, చిత్ర దర్శకుల్ని కదిలించలేకపోటం విడ్డూరం. వాళ్ళు తమ కళ్ళూ, చెవులూ తెరుచుకుంటే చాలు!" ఈ వేదనే సత్యజిత్ రాయ్‌ను సినిమాల వైపు ధృఢ సంకల్పంతో నడిపించింది.

**ఎడిటింగ్**

చిత్ర నిర్మాణంలో ఎక్కువగా గుర్తింపు లేని ఒక ముఖ్యఅంశం "ఎడిటింగ్". రాయ్ తన మొదటి సినిమా పథేర్ పంచాలి తీస్తున్నప్పుడే జరిగిన ఎడిటింగ్ అనుభవాన్ని రాయ్ ఆసక్తికరంగా ఇలా వివరిస్తాడు. సినిమాలు తీసే దర్శకులు ఎందుకు సినిమా తీయటం లో ఉండే సాధక బాధకాలు గురించి ఎక్కువగా రాయరు? సినిమా తీస్తున్నప్పుడు ఒక్క రోజులో జరిగే పని రాయాలన్నా కూడా కష్టమే! ఈ సినిమా తీసే ప్రక్రియ అతి సంక్లిష్టమైనది. సినిమా తీసేవాడికి, తీస్తున్న యంత్రాలు, (అంటే కెమేరా) తీయబడుతున్న వస్తువులు (అంటే నటీనటులు కాని, ప్రకృతి సంబంధమైన దృశ్యాలు కాని) మధ్య ఉండే త్రికోణ సంబంధం అర్థం చేసుకోటం కష్టం. ఎంతటి ప్రతిభాశాలి అయిన దర్శకుడైనా, అతని మనసులో మెదిలే భావాలు స్పష్టంగా కాగితం మీద పెట్టటానికి భాష చాలదు. పథేర్ పంచాలి సినిమా తీస్తున్న మొదటి రోజే, కొన్ని పాఠాలు నేర్చుకున్నా. ఉదాహరణకి, దుర్గ తన తమ్ముడు అపుకి తెలియకుండా అపుని చూసే దృశ్యం తియ్యాలి. నేను మీడియం క్లోజప్ ఉండేట్లు ఒక మామూలు లెన్సు కెమేరాకు వాడదామనుకున్నా. ఈ దృశ్యంలో, దుర్గను నడుం నుంచి పైభాగం అంతా చూపిస్తూ తియ్యాలనుకొన్నా. ఆ రోజు షూటింగ్‌లో ఫొటోగ్రఫీ వృత్తిగా ఉన్న ఒక స్నేహితుడు షూటింగ్ లొకేషన్‌లో ఉన్నాడు. ఆ సీన్‌లో దుర్గ ఏం చెయ్యాలో నేను చెపుతున్నప్పుడు, ఆ స్నేహితుడు నా కెమేరాను సవరించడం చూసా. అతను నేను పెట్టిన మీడియం క్లోజప్ లెన్సు తీసేసి లాంగ్ క్లోజప్ లెన్సు పెట్టి, నన్ను కెమేరా నుంచి దుర్గను చూడమన్నాడు.

నాకు అంతకు ముందు స్టిల్ కెమేరాతో చాలా అనుభవం ఉన్నా, ఎప్పుడూ లాంగ్ ఫోకల్ లెంగ్తు ఉన్న లెన్సుతో పని చెయ్యలా. నిజమే! ఈ లెన్సు వల్ల దుర్గ మొహం నిండుగా కనపడింది. మొత్తం మీద ఆ దృశ్యం అలాగే లాంగ్ క్లోజప్ లెన్సుతో పూర్తి చేసాం. దాంతో దుర్గ మొహం అంతా అతి స్పష్టంగా కనపడుతూ, సూర్య కిరణాలు మొహంపై పడటం వల్ల, వింత వెలుగులతో దుర్గ మొహం ప్రేక్షకులకు కనపడుతుంది. ఈ దృశ్యం చూసిన వాళ్ళెవ్వరైనా, ఆ పనితనాన్ని మెచ్చుకు తీరాలి. ఈ సమయానుకూలమైన సలహాకి నా స్నేహితుడ్ని అభినందించి ఆ రోజు కార్యక్రమం పూర్తి చేసాం.

కొన్ని రోజుల తరవాత, ఫిలింని కత్తిరిస్తూ ఎడిట్ చెయ్యబోతూ, ఈ దృశ్యాన్ని చూసి బిగుసుకు పోయా! ఆ చిన్న షాట్ బాగానే వచ్చింది కాని, మిగిలిన షాట్లతో సరిగ్గా ఇమడలా. కొట్టొచ్చినట్టు చాలా తేడాగా ఉంది. ఇది ఎందుకూ పనికి రాదు అన్న విషయం నాకు బోధపడింది. దీన్నుంచి రెండు విషయాలు నేను నేర్చుకున్నా. మొదటిది - ఒక దృశ్యం, సందర్భానికి తగినట్టు ఎంత అందంగా ఉండాలో అంతే అందంగా తియ్యాలి. ఎక్కువా పనికి రాదు. తక్కువా పనికి రాదు. రెండవది - ఏ వ్యక్తి దగ్గర నుంచి అయినా సరే, తియ్యబోతున్న సినిమా లోని అసంపూర్ణమైన అవగాహన ఉంటే తప్ప సలహా తీసుకోకు. దర్శకుడికి సినిమా తియ్యటంలోని అన్ని విషయాలపై ఉన్నంత లోతైన అవగాహన, మరొకరికి ఉండే అవకాశం తక్కువ.

**సంగీతం**

రాయ్ అపు చిత్రత్రయంలోని మూడు సినిమాలకు సంగీతం ప్రఖ్యాత సితార విద్వాంసుడు పండిట్ రవి శంకర్ సమకూర్చాడు. తరవాత సినిమాలకు రాయ్ స్వయంగా సంగీతం అందించటం మొదలెట్టాడు. ప్రత్యేకంగా, రాయ్‌కి అటు పాశ్చాత్య సంగీతం, ఇటు భారతీయ సంగీతం, రెండిటిలో చెప్పులోతగ్గ ప్రవేశం ఉండటమే కాకుండా, సినిమాలకి ఎటువంటి సంగీతం ఉపయోగించాలో కూడా బాగా తెలుసు.

పాశ్చాత్య సంగీతంపై రాయ్ స్పందన సహజంగా ధృఢమైనది. దానికి తోడు ఒకటి, రెండు పుస్తకాలు సినిమాల బాగోగులు మీద చదవటం సహాయపడింది. రాయ్ మాటల్లో,"ఎంత ఆశ్చర్యం! సినిమాకి, సంగీతానికి

ఎన్ని పోలికలు! రెండూ సమయం గడుస్తున్న కొద్దీ వాటిలోని రహస్యాలను విప్పి చెపుతాయి. రెంటికి లయ ప్రధానం. అలాగే రసం - అంటే బాధ, ఆనందం, లోతైన ఆలోచనాత్మకం, సందడిగా ఉందటం, విచారం, ఉల్లాసం - ప్రధానమైనవి. ఇక్కడ సంగీతం అంటే, పాశ్చాత్య సంగీతానికి మాత్రమే పరిమితమైన పోలికలు ఇవి. ఎందుకంటే, భారతీయ సంగీతంలో అప్పటికప్పుడు సృష్టి చేసే అవకాశం ఉంటుంది కాబట్టి ఉన్న వ్యవధిలో బాణీలో వైవిధ్యం తీసుకురావాటానికి అవకాశం ఎక్కువ. పైగా భారతీయ సంగీతం అలంకార ప్రధాన మైనది. ఇందులో నాటకీయత లేదు. అతి నెమ్మదిగా మొదలై వేగమైన ముగింపును ఇస్తుంది. ఈ ప్రయాణం లో అతి సంక్లిష్టమైన లోతుల్ని చూపుతుంది. ఒక రాగంలో ఉన్న స్వరాల ద్వారా అనుభూతుల్ని ప్రేక్షకులకి ఇవ్వటానికి ప్రయత్నిస్తాడు సంగీతకారుడు. అందుకనే, మన సంగీతం గొప్పతనం అత్యుత్తమ స్థాయికి చేరిన విద్వాంసులు మాత్రమే చూపగలరు. ఈ యాత్రలో సంగీతంలోని అందం, బిగి, ఉద్రేకం చూపిస్తూ సంగీతం ఘనత చూపిస్తాడు విద్వాంసుడు. కానీ, ఇందులో నాటకీయత చూపించలేడు. ఎందుకంటే, మన సంగీతంలో ఘర్షణ లేదు!"

**స్క్రిప్ట్**

రాయ్ ఎప్పుడూ రెండు సినిమాలపై ఒకేసారి పనిచేయలేదు. ఒకే రకమైన సినిమాలు వెంట వెంటనే తీయటం రాయ్‌కి పడదు. ఇందుకు కారణం రాయ్‌లోని అశాంతో, దిశారాహిత్యమో, లేక దృక్పథంలోని అస్పష్టతో తెలియదు. ఒక విషయం మాత్రం రాయ్‌కి ఖచ్చితంగా తెలుసు. జీవితం అందించే అనేక అందాలు- ఆనందాలు, అనేక కాలాల్లో జరిగిన చరిత్ర, అన్నిటికన్నా సినిమా చిత్రీకరించటంలో ఉన్న అనేక వైవిధ్యాలు రాయ్‌కి ఇష్టం. రాయ్ సినిమాకి కథ రాస్తున్నప్పుడు తన జీవితంలో పరిచయమున్న పాత్రలను ఉపయోగించు కోవటం చూస్తాం! తనకి ముఖాముఖి పరిచయం లేని పాత్రలను, మరొకరి సహాయంతో అర్థం చేసుకోగలనని రాయ్ స్వయంగా చెప్పుకున్నాడు. మనస్తత్వశాస్త్రం రాయ్ సినిమా నిర్మాణంలో అతి ముఖ్యమైనది అన్న విషయం "చారులత" సినిమాలో స్పష్టంగా తెలుస్తుంది. ఒక పాత్ర మానసిక స్థితి లోని మార్పు - ఆ పాత్ర అంతరంగంలో వచ్చే మానసిక పరిమాణం అత్యంత ప్రతిభతో "చారులత" సినిమాలో చిత్రీకరించాడు.

చిత్ర దర్శకులకి చిత్ర నిర్మాణంలో తగినంత సృజన లేకపోవటంపై రాయ్ తన అసహనం చూపిస్తాడు. "ఒక రచయిత పదాల కోసం వెతుకుతుంటే, నిఘంటువు సాయపడగలదు. కానీ, చిత్ర నిర్మాణానికి నిఘంటువు లేదే! ఎన్ని సినిమాల్లో ఒక పాత్ర చావు చూపించటానికి వెలుగుతూ ఉన్న దీపాన్ని ఆర్పటం చూపించారో! ఈ ఒక్క విషయంలోనే సృజనకి ఎంతో అవకాశముంది" అని రాయ్ అంటాడు."అపరాజితో" సినిమాలో హరిహర్ పాత్ర మరణం నిర్ధారించటానికి రివ్వున గాల్లోకి ఎగిరి వలయాకారంగా తిరిగే పావురాలను చూపటం సృజనకి ఒక ఉదాహరణ.

సినిమాలో సంభాషణలపై రాయ్ ఆలోచనలు ఇలా ఉంటాయి. "సంభాషణలు వింటున్నప్పుడు ఆ రచయితను ఎవ్వరూ స్మరించుకోనివే ఉత్తమ సంభాషణలు!" సంభాషణల పట్ల రాయ్ అభిప్రాయలు చిత్రంగా ఉంటాయి. రాయ్ దృష్టిలో -అతి కీలకమైన సన్నివేశాల్లో సంభాషణలు ఉండకూడదు.

**దర్శకత్వం**

ఏ మాత్రం శ్రమ, అట్టహాసమైన కుదుపులు లేకుండా రాయ్ గీసిన చిత్రం ప్రేక్షకుల్లో అంతులేని అలజడి కలిగిస్తుంది. ఇది ఎలా సాధిస్తాడు? ఇందులో అనవసరమైన, అవకతవకలున్న సినిమాటోగ్రఫీ కిటుకులు ఏమీ లేవు. అందులోనే ఉంది రాయ్ పాండిత్య ప్రకర్ష రహస్యం!

సినిమా నిర్మాణంలో అన్ని అంశాలపై రాయ్ సాధికారతను తెలిపే ఈ క్రింది వాక్యానికి ఎంతో భాష్యం చెప్పుకోవచ్చు!

సినిమా సంబంధించిన ప్రతి విషయం క్లిష్టమైనదే!

(సత్యజిత్ రాయ్‌పై వ్యాసం రాయమని సూచించి అందుకు తగిన వివరాలు అందించిన నా మేనకోడలు శ్రీమతి చామర్తి కల్పనకి అభినందనలతో - రచయిత)


